క్లుప్తంగా

సదుపాయాలు మెరుగుపర్చండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి అన్నారు. కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, షామియానా తదితర ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్యూలైన్‌లో ఉండే ఓటర్లకు అసౌకర్యం కల్పించవద్దన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్, ఏఆర్‌ఓ శంకర్‌నాయక్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి జగనన్న
కేశినేని శ్వేత



జి.కొండూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జగనన్న చేస్తున్న కృషి ఎనలేనిదని కేశినేని శ్వేత అన్నారు. మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుతో కలిసి ఆమె వెల్లటూరులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కేశినేని శ్రీనివాస్ (నాని) అంటే అభివృద్ధే గుర్తొస్తుందని చెప్పారు. ఆయన ఎంపీగా ఉన్న పదేళ్లలో రూ.8 వేల కోట్ల నిధులతో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశారన్నారు. జగనన్న సంక్షేమ, అభివృద్ధి పాలన కొనసాగాలంటే సర్నాల తిరుపతిరావుని ఎమ్మెల్యేగా, కేశినేని శ్రీనివాస్ (నాని)ని ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పరిశీలకులు ప్రీతీందర్ సింగ్ అన్నారు. జిల్లాలో చెక్‌పోస్టుల తనిఖీలో భాగంగా గుంటుపల్లి వద్ద హైవే పక్కన ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ఆయన పరిశీలించారు. రాష్ట్ర సరిహద్దుల నుంచి వచ్చిపోయే వాహనాలు పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే వదిలిపెట్టాలన్నారు. నగదు, మద్యం, విలువైన వస్తువులకు తగిన ఆధారం లేకుంటే స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఇండ్ గ్యాప్ పొలంబడితో రైతులకు మేలు



జి.కొండూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇండ్ గ్యాప్ పొలంబడితో రైతులు ఆర్గానిక్ పద్ధతిలో మేలైన దిగుబడులు పొంది విదేశాలకు నేరుగా ఎగుమతి చేసుకునే వీలు కలుగుతుందని వ్యవసాయ కమిషనరేట్ డీడీఏ బాలునాయక్ తెలిపారు. మండల పరిధి కుంటముక్కల గ్రామంలో వైఎస్సార్ గ్యాప్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా మేలైన సాగు పద్ధతులపై శిక్షణ పొందిన రైతులు సాగు చేస్తున్న రబీ వరి పైరును బాలునాయక్‌తో పాటు ఏపీఎస్‌ఓపీసీఏ నుంచి డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ యుగంధర్, స్టేట్ వైఎస్సార్ పొలంబడి ఏడీఏ వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. శిక్షణ పొందుతున్న పదిమంది రైతులు పండించిన రబీ వరి పైరు నుంచి ధాన్యం శాంపిల్స్‌ను సేకరించారు. బాలునాయక్ మాట్లాడుతూ ఈ శాంపిల్స్‌ను పరీక్షలు జరిపిన అనంతరం ధాన్యంలో నిబంధనలకు లోబడి రసాయనిక అవశేషాలు ఉన్నట్లు తేలితే రైతులు తమ ధాన్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసుకునేలా సర్టిఫికెట్‌లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ రాంకుమార్, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



తిరువూరు: తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 140 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గంపలగూడెం మండలం కనుమూరులో బెల్టు దుకాణాలకు తెలంగాణ మద్యం సరఫరా చేస్తున్న బొల్లికొండ శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని 70 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామంలో షేక్ బాజీవలీ నుంచి మరో 70 మద్యం సీసాలను, మోపెడ్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు.

పెత్తందారులకు ఓటమి భయం





చిన్ననందిగామ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న సర్నాల తిరుపతిరావు : గణపవరంలో ప్రచారం చేస్తున్న బొల్లారెడ్డి దేవరాజ్‌రెడ్డి

మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు

జి.కొండూరు: ఓటమి భయంతోనే సామాన్యుడిపై యుద్ధం చేసేందుకు పెత్తందారులంతా ఏకమయ్యారని, ప్రజలంతా గమనించి దశాబ్దాల రాజకీయ చరిత్రను తిరగరాసే తీర్పు ఇవ్వాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. జి.కొండూరు మండలం హెచ్. ముత్యాలంపాడు, కందులపాడు, చేగిరెడ్డిపాడు, చిన్ననందిగామ, వెల్లటూరు గ్రామాలలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తల నుంచి తిరుపతిరావుకు ఘన స్వాగతం లభించింది. తిరుపతిరావు మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌కి, ఆయనను సపోర్టు చేస్తున్న పెత్తందారులు దేవినేని ఉమామహేశ్వరరావు, కోమటి జైరాంలాంటి వ్యక్తులకు పేద, బడుగు, బలహీన వర్గాలంటే చిన్నచూపు అని చెప్పారు. సామాన్యుడిగా బరిలోకి దిగుతున్న తనకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక గంగిరెద్దు, కుక్కినపేను అంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వసంత ఒక వైపు, ఓటర్లను వెధవలంటూ మాట్లాడిన కోమటి జైరాం మరో వైపు, బీసీలను దిష్టి బొమ్మలతో పోల్చిన మరో టీడీపీ నాయకుడు ఇంకో వైపు, ఇలాంటి పెత్తందారులకు అహంకారం తగ్గాలంటే మైలవరం నియోజకవర్గ ప్రజలు ఇచ్చే తీర్పు చరిత్రలో గుర్తిండిపోవాలన్నారు. నిత్యం తనను కించపరుస్తూ మాట్లాడుతున్న వసంత, ఈ ఎన్నికలతో రాజకీయ సన్యాసం తీసుకోవడం ఖాయమన్నారు. మైలవరం నియోజకవర్గానికి సాగు, తాగు నీరు ఏదిక్కు నుంచి వస్తుందో కూడా తెలియని వసంత వెంకట కృష్ణ ప్రసాద్ స్థాయికి మించి ముఖ్యమంత్రిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నివేల మందిని బయటి నియోజకవర్గాల నుంచి తీసుకొచ్చి ప్రచారాలు నిర్వహించినా నియోజకవర్గ ప్రజలు ఈ సారి స్థానికుడికే పట్టం కడతారని చెప్పారు. దిగుమతి నేతల్లా నియోజకవర్గాన్ని దోచుకునే వ్యక్తిని తాను కాదని, స్థానికుడిగా, ప్రజల మనసెరిగిన నాయకుడిగా, నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తిరుపతిరావు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలి

గణపవరం(మైలవరం): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని, తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనల్లుడు, గణపవరం జమీందారు బొల్లారెడ్డి యువరాజ్‌రెడ్డి తనయుడు బొల్లారెడ్డి దేవరాజ్‌రెడ్డి అన్నారు. మైలవరం మండలం గణపవరం గ్రామంలో సర్నాల తిరుపతిరావుకు మద్దతుగా మంగళవారం గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోరే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారంలోకి తీసుకువస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యేగా తిరుపతిరావును, ఎంపీగా కేశినేని నానిని ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

● **రెడ్డిగూడెం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో దేశానికి ఆదర్శంగా నిలిచారని మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు కుమారుడు జ్యేష్ఠ శ్రీనాథ్ అన్నారు. వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు గెలుపు కోరుతూ ఆదివారం రెడ్డిగూడెం ఎస్సీ ఏరియాలో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా సర్నాల తిరుపతిరావును, కేశినేని నానిని ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సర్నాల తిరుపతిరావు తమ్ముడు స్వామి, కుమార్తె భవానీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

- చల్లబడిన వాతావరణం
- పలుచోట్ల తెగిపడిన విద్యుత్ వైర్లు
- రాలిపోయిన మామిడికాయలు



తిరువూరు సుందరయ్య కాలనీ నివాస గృహాల్లో చేరిన వర్షం నీరు

నూజివీడు: పట్టణంతో పాటు మండలంలో మంగళవారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు కురిసిన భారీ వర్షంతో పట్టణంలోని డ్రెయినేజీలు వరదనీటితో పొంగి పొర్లాయి. రహదారులన్నీ వరదనీటితో నిండిపోయి వాగులను తలపించాయి. పల్లపు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరింది. మండుతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజానీకం వాతావరణం చల్లబడటంతో సేద తీరారు. ఈదురు గాలులకు ఎమ్మార్ అప్పారావు కాలనీలో పలు గృహాలపైన రేకులు ఎగిరి కింద పడ్డాయి. ఈ రేకుల కారణంగా కరెంటు తీగలు తెగి పడ్డాయి. తోటల్లో మామిడి కాయలు ఈదురు గాలులకు నేలరాలాయని రైతులు వాపోయారు.

● **ఆగిరిపల్లి:** ఆగిరిపల్లిలో మంగళవారం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వేళ ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గంటకు పైగా వర్షం కురవడంతో రెండు నెలల నుంచి ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న మండల ప్రజలకు ఉపశమనం లభించింది. మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కోతకు వచ్చిన మామిడికాయలు నేల రాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తిరువూరులో భారీవర్షం

తిరువూరు: తిరువూరు మండలంలో మంగళవారం ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన భారీవర్షం కురిసింది. స్థానిక నాగార్జునసాగర్ క్యాంప్ కాలనీలో పిడుగు పడి ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైంది. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సుగాలీ కాలనీ, రాజుపేట, గొల్లబజారు, తంగిళ్లబీడు, బోయబజార్లలో పిడుగులు పడి ప్రజలు ఆందోళన చెందారు. సుగాలీ కాలనీలోని పలు నివాసగృహాల్లో షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. రాజుపేట గొల్లబజారులో ఎంపీపీ స్కూల్ సమీపంలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడి పాక్షికంగా దగ్ధమైంది. రాజుపేటలోని పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. బోయ కాలనీలో గోధుమ బ్రహ్మయ్య ఇంటిపై పిడుగు పడి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. పలు ప్రాంతాల్లో ఎయిర్ కండీషనర్లు, ఫ్రిజ్‌లు, టీవీలు ధ్వంసమయ్యాయి.



తిరువూరు మధిర రోడ్డులో నిలిచిన వర్షం నీరు



గోగులంపాడులో ఇంటిలోకి చేరిన వర్షం నీరు

ముసునూరు మండలంలో..

ముసునూరు: మండలంలో రెండు గంటల పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలో 23 విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోగా, 20 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అక్కిరెడ్డిగూడెంలో పలుచోట్ల అరటి పంట నేల కొరిగింది. రమణక్కపేట, సూరేపల్లిలో మామిడికాయలు నేల రాలాయి. చింతలవల్లిలో పిడుగుపాటుకు పాడి గేదె చనిపోగా, శివారు గ్రామం గోగులంపాడు రజక వీధిలో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

సహాయక చర్యలు..

రోడ్లపై చెట్లు కూలిపోవడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. స్పందించిన అధికారులు సిబ్బందితో చెట్ల కొమ్మలు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. విద్యుత్ శాఖ ఏఈ హేమసుందరకుమార్ ఆధ్వర్యంలో పడిపోయిన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. విద్యుత్ తీగలపై పడిన చెట్లను తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నామని ఏఈ తెలిపారు.

● **తిరువూరు:** ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో పీపుల్స్ మేనిఫెస్టో ప్రచార బుక్‌లెట్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవడం పౌరుడి ప్రాథమిక విధిగా గుర్తించాలన్నారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు హరికృష్ణ, సభ్యులు రాం ప్రదీప్, పాపారావు, సుధాకర్, సుదర్శన్, సైదులు, సుబానీ, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యం

నూజివీడు: సీఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ ఓటర్లను కోరారు. పట్టణంలోని 28వ వార్డులో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అందించిందని, సంక్షేమ పథకాలన్నీ మళ్లీ అమలు కావాలంటే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. చంద్రబాబు పాలనలో నూజివీడు అభివృద్ధికి చేసింది శూన్యమని, వైఎస్ జగన్ పాలనలో పట్టణానికి రూ.16 కోట్లు మంజూరు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన మేకా ప్రతాప్ అప్పారావును, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇంటింటా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం..

చాట్రాయి: సంక్షేమ పాలన కొనసాగేందుకు ప్రజలంతా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చిత్తపూరు గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేశారని చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు ప్రజల్ని మోసం చేసాడని విమర్శించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతాప్ అప్పారావుకు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరువీధి రమేష్, ఎంపీటీసీ యల్లంకి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు మాదల సత్యనారాయణ, దామెర చలపతిరావు, చాట్రాయిలో సర్పంచ్ దామెర ఉషా, ఎంపీటీసీ సంకు శివకుమారి, దామెర ప్రసాదుబాబు పాల్గొన్నారు.



నూజివీడులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ



చిత్తపూరులో ప్రచారం చేస్తున్న దేశిరెడ్డి

ఈదురుగాలులకు నేలరాలిన మామిడి

పెనుగంచిప్రోలు: ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలు మంగళవారం మధ్యాహ్నం నుంచి మారిన వాతావరణంతో కొంత ఉపశమనం పొందారు. భారీగా వీచిన ఈదురుగాలుల ఉధృతికి మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. పలుచోట్ల కొమ్మలు విరిగిపడిపోయాయి. ఏటా మామిడికాయలు కోతల సమయంలో ఇలా ఈదురుగాలులకు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పంట దిగుబడి అంతంతమాత్రంగానే ఉన్న సమయంలో ఈదురుగాలులకు కాయలు రాలిపోయి నష్టం వాటిల్లిందని తెలిపారు. అదేవిధంగా పెనుగంచిప్రోలు తుఫాన్ కాలనీలో చెట్టు కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్‌వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు

చిట్టేల(వత్సవాయి) : గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు మంగళవారం పుణ్యావాహచన, అగ్నిస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదపడింతులు మంత్రోచ్చారణల నడుమ సోమవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని ఆలయ ధర్మకర్త మార్లెళ్ల పుల్లారెడ్డి దంపతులు పీటలపై కూర్చుని అత్యంత వైభవంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

పేదరిక నిర్మూలనకు పథకాల కొనసాగింపు

తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు

తిరువూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదరిక నిర్మూలనకు ఉపయోగపడ్డాయని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు నగర పంచాయతీలోని 14, 15, 16 వార్డుల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 90 శాతం సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసిందని, ఈ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని స్వామిదాసు చెప్పారు. పేద కుటుంబాల ఆర్థిక, సామాజిక ప్రగతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపిస్తేనే పేదలకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. వైఎస్సార్ సీపీ తిరువూరు పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్లు పసుపులేటి శేఖర్‌బాబు, పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, పరసా సత్యనారాయణ, వెలుగోటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో స్వామిదాసు

వైఎస్సార్ సీపీలో 20 కుటుంబాలు చేరిక..

తిరువూరు మండల భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు నల్లగొర్ల వేలాద్రి ఆధ్వర్యంలో 20 కుటుంబాలు తెలుగుదేశం నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి స్వామిదాసు పార్టీలోకి ఆహ్వానించారు.

80 శాతం ఓటింగ్ లక్ష్యంగా చర్యలు

మైలవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి

భవానీపురం(విజయవాడ పశ్చిమ): నైతిక విలువలతో కూడిన ఓటింగ్ దిశగా ప్రతి ఓటరూ పయనించాలని, తద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని మైలవరం నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ గొల్లపూడిలోని డీటీటీసీ భవనంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచి నాయకులు రావాలంటే అది ఓటర్ల చేతుల్లోనే ఉంటుందన్నారు. ఓటు వేయడం ప్రతి భారతీయ పౌరుని బాధ్యత అని చెప్పారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనేది మహిళా ఓటర్లతోనే సాధ్యమవుతుందన్నారు. ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అలాగే గ్రామాల్లోని యువతీ యువకులు తమ ప్రాంతంలోని ఓటర్లను తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనేలా చైతన్యపరచాలని చెప్పారు. స్వీప్ నోడల్ ఆఫీసర్ వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ 50 శాతం మంది మాత్రమే నిజాయతీగా ఓటు వేస్తున్నారని తెలిపారు.

గ్రామాల్లో ఓటు వేయని మహిళ ఉండకూడదని పేర్కొన్నారు. గ్రామాల్లో 16 శాతం మంది ఓటింగ్‌కు రావడం లేదని, వారిని కూడా తీసుకురావాలని ఎస్‌హెచ్‌జీ మహిళలకు సూచించారు. రూరల్ ఎంపీడీఓ రమ్యశ్రీ మాట్లాడుతూ తమ పరిధిలోని మహిళలు తప్పనిసరిగా ఓటు వేసేలా డ్వాక్రా మహిళలు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలుత కళాజాతా స్కిట్స్, ఫ్లాష్‌మాబ్ ద్వారా పిచ్చయ్య, డప్పు రమేష్ ఓటర్లకు అవగాహన కల్పించారు. చివరిగా డ్వాక్రా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శేషగిరిరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు లియోనా, జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్ సింగ్ బాలి, చిత్రంలో జేసీ సంపత్ కుమార్ తదితరులు

235 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను నిర్వహించారు. 235 మంది సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వై.భవానీశంకరి తెలిపారు. వీరిలో నూజివీడు నియోజకవర్గానికి చెందిన వారు 183 మంది కాగా, ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు 52 మంది ఉన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగింది. రిటర్నింగ్ అధికారి భవానీశంకరి పర్యవేక్షించారు. మిగిలిన వారు బుధవారం రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చని చెప్పారు.

● **మైలవరం:** ఎన్నికల్లో పాల్గొంటున్న పోలింగ్ అధికారులు 170 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని నియోజకవర్గ పోలింగ్ అధికారి, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పీ. సంపత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

● **తిరువూరు:** తిరువూరు నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే గడువు పెంచడంతో మంగళవారం 104 మంది ఓటువేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి భవానీశంకరి

హామీలకు మించి పథకాల అమలు

విస్సన్నపేట: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు మించి ఎన్నో సంక్షేమ పథకాలను పార్టీల కతీతంగా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు అన్నారు. తిరువూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)కి మద్దతుగా విస్సన్నపేటలోని పలు వార్డుల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, మండల యూత్ అధ్యక్షుడు ఆలీ రహమాన్, నాయకులు పాల్గొన్నారు. మండలంలోని కొండపర్వ గ్రామంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలిపించాలని కోరుతూ సర్పంచ్ జి. రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు జి. చంద్రశేఖరరావు, మంగయ్య, నాయకులు ప్రచారం నిర్వహించారు. కలగర గ్రామంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ దేశిరెడ్డి రమ, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని విజయాన్ని కాంక్షిస్తూ కొండపల్లి, ఇబ్రహీంపట్నం మండల పరిధి గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ విజయంతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు సాధ్యమని నాయకులు ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విస్సన్నపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు



కొండపల్లిలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్ తదితరులు